ఆలయ అర్చకుడికి ఇల్లు

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నిర్మించి ఇచ్చిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్


గృహ ప్రవేశ పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

అత్తాపూర్: తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అత్తాపూర్ గ్రామ శివాలయ ఆవరణలో దేవాలయ అర్చకుడికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే తోల్కంటి ప్రకాష్‌గౌడ్ తన సొంత నిధులతో కొత్త డబుల్ బెడ్‌రూమ్ ఇంటిని నిర్మించారు. గ్రామ పెద్దలు కె.మోహన్‌రెడ్డి, బి.శ్రీనివాస్‌రెడ్డి, మిద్దెల సురేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నూతన గృహ ప్రవేశ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు మాట్లాడుతూ... ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కుటుంబంపై దేవుడి కృప ఎల్లవేళలా ఉండాలని, ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవిస్తారని దీవించారు. ఆయన పేరుపై ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను పూలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వనం శ్రీరాంరెడ్డి, మిద్దెల సురేష్‌రెడ్డి, చెరుకు అమరేందర్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సత్తిరెడ్డి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా కాలనీల అభివృద్ధి


మార్కండేయనగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ అన్ని కాలనీలను దశలవారీగా అభివృద్ధి చేస్తానని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మార్కండేయ నగర్‌లో రూ. 40 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... మార్కండేయనగర్‌లో సీసీ రోడ్లు గుంతలమయంగా మారడంతో జీహెచ్‌ఎంసీ నుంచి నిధులు మంజూరు చేయించానని తెలిపారు. ముందుగా డ్రైనేజీ లైన్ బాగు చేయించి అనంతరం రోడ్ల పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఏఈ నర్సింహమూర్తి, స్థానిక నేతలు విడెం రమేష్ , వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, రమేష్, చందు, సూర్యనారాయణ, చింటూ, భాస్కర్, ధనుంజయ, శ్యామ్, శీను తదితరులు పాల్గొన్నారు.

మణికొండను అగ్రస్థానంలో నిలిపాం

మున్సిపల్ ఛైర్మన్ నరేందర్‌ముదిరాజ్


అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించి పలు అభివృద్ధి పనులను చేపట్టి హైదరాబాద్ నగర శివారులోని మణికొండ మున్సిపాలిటీని అగ్రస్థానంలో నిలిపామని మున్సిపల్ ఛైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో ఆయన రూ. 50 లక్షల వ్యయంతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీ ఏర్పడినప్పుడు చాలా ప్రాంతాల్లోని రోడ్లపై వర్షపు నీరు నిలిచి రాకపోకలతో పాటు చుట్టు పక్కల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయన్నారు. కోట్లాది రూపాయాలను ఖర్చు చేసి డ్రైనేజీల సామర్థ్యాన్ని పెంచటంతో పాటు కొత్త డ్రైనేజీ లైన్లను ఏర్పాటు చేసి వరద సమస్యలను దూరం చేశామన్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా వరద నీరు రోడ్లు, కాలనీల్లో నిలువకుండా చేశామన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన చోట్ల పనులు చేపట్టి సమస్యలు లేకుండా చేస్తామన్నారు. ఏఈ సంజయ్, కౌన్సిలర్లు డి.పురుషోత్తం, కె.లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.జితేందర్, కార్య నిర్వాహక అధ్యక్షుడు ఎస్.కిరణ్‌కుమార్, బాబుజానీ తదితరులు పాల్గొన్నారు.

కలాం ఏరోస్పేస్ కన్వెన్షన్‌లో ఎంజీఐటీ విద్యార్థుల సందడి


కార్యక్రమంలో పాల్గొన్న ఎంజీఐటీ విద్యార్థులు

మణికొండ: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 93వ జయంతిని పురస్కరించుకుని హైటెక్ సిటీలోని శిల్పకళా వేదికలో నిర్వహించిన కలాం ఏరోస్పేస్ కన్వెన్షన్-2024లో గండిపేటలోని మహాత్మా గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాల విద్యార్థులు పాల్గొని సందడి చేశారు. ఈ కన్వెన్షన్‌లో క్విజ్, ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌ల ద్వారా విద్యార్థులకు వివిధ రంగాలకు చెందిన శాస్త్రవేత్తలు, పారిశ్రామిక దిగ్గజాలతో అనుసంధానం కల్పించారని ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్లు డాక్టర్ వి.సైదులు, సుధ, దివిజ వెల్లడించారు. అంతరిక్ష, ఇతర పరిశోధనల సంస్థలైన డీఆర్‌డీఓ, ఇస్రో, ఐఐఎస్‌సీల నుంచి పలువురు వక్తలు వారి పరిశోధనల గురించి అనేక విషయాలను విద్యార్థులకు వివరించారన్నారు. ఇలాంటి కన్వెన్షన్‌లతో విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అత్యాధునిక ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి


కుస్తీ పోటీలను ప్రారంభిస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

లంగర్‌హౌస్: ఔత్సాహిక క్రీడాకారుల కోసం కార్వాన్‌లో అత్యాధునిక సౌకర్యాలతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన సబ్జిమండిలోని గంగపుత్ర సంఘం వీర్ అభిమన్యు వ్యాయామశాలలో 68వ తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్ ఫెడరేషన్ రెజిలింగ్ పోటీలను ప్రారంభించారు. అండర్-19 పోటీలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నానన్నారు. మొదటగా ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానల్లో విద్యార్థుల కోసం వారు ఇష్టపడేలా గ్రౌండ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. గోల్కొండ రిసాలాబజార్‌లోని ఒవైసీ ప్లే గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ కోర్టును ఇటీవలే ప్రారంభించామన్నారు. అదేవిధంగా గంగపుత్ర సంఘం వారు అత్యాధునిక వ్యాయామశాలను కూడా తయారుచేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ అధికారులు, కోచ్‌లు, వీరభిమన్యు వ్యాయామశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

లంగర్‌హౌస్: దసరా సందర్భంగా తక్కువ సమయంలో పూర్తిగా సహకరించి ఏర్పాట్లు చేయించి ఎమ్మెల్యే కౌసర్ సేవా, సమయస్ఫూర్తి చాటుకున్నారని లంగర్‌హౌస్ దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బోగి బాల్‌రాజ్ అన్నారు. బతుకమ్మ, దసరా ఉత్సవాలు విజయవంతంగా ముగియడంతో అందులో సహకారం అందించినందుకు ఆయన ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా బోగి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. తక్కువ సమయమే ఉంది ఎలాంటి ఏర్పాట్లు జరగకపోవడంతో ఎమ్మెల్యేను కలిసి విన్నవించుకున్నామన్నారు. ఆయన వెంటనే స్పందించి అన్ని శాఖల అధికారులతో మాట్లాడి ఏర్పాట్ల విషయమై ఆదేశాలిచ్చారన్నారు. దీంతో అధికారులు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసి దసరా, బతుకమ్మ వేడుకలు విజయవంతంగా ముగించడంలో ఎమ్మెల్యే భాగస్వాములవ్వడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, దసరా ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి అనిల్, కోశాధికారి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పంచాయతీల విలీనంతో నిరాశ!

- తగ్గిన శంషాబాద్ మండల పరిధి
- మున్సిపాలిటీలో ఆరు పంచాయతీల విలీనం
- రెండు ఎంపీటీసీ స్థానాలు రద్దు
- రాజకీయ నేతల్లో సర్వత్రా నిరాశ


మండల పరిషత్ కార్యాలయం భవనం

శంషాబాద్ రూరల్: మున్సిపాలిటిలో పంచాయతీల విలీనంతో శంషాబాద్ మండల పరిషత్ పరిధి కుంచించుకుపోయింది. ఇప్పటి వరకు మండలంలో 27 పంచాయతీలు ఉండగా.. వీటిలో ఆరు గ్రామ పంచాయతీలు శంషాబాద్ మున్సిపాలిటిలో విలీనం చేస్తూ ఇటీవల ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. దీంతో మండలంలో పంచాయతీల సంఖ్య 21కు చేరింది. గత నెల చివరలో ఆయా పంచాయతీల రికార్డులను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా ఆయా పంచాయతీ భవనాలపై పురపాలక వార్డు కార్యాలయాల బోర్డులను సైతం ఏర్పాటు చేశారు.

తగ్గుతూ.. పెరుగుతూ..

మండల పరిధిలో 2019కి పూర్వం 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. శంషాబాద్ మున్సిపాలిటి ఏర్పాటుతో వీటి సంఖ్య 18కి తగ్గింది. శంషాబాద్ మేజర్ పంచాయతీతో పాటు ఊట్‌పల్లి, తొండుపల్లి, కొత్వాల్‌గూడ, గొల్లపల్లి, సాతంరాయి గ్రామ పంచాయతీలను మున్సిపాలిటిలో విలీనం చేశారు. ఆ తర్వాత మండలంలో కొత్తగా గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయడంతో వీటి సంఖ్య 27కు చేరింది. అయితే ప్రస్తుతం మరో ఆరు గ్రామ పంచాయతీలు మున్సిపాలిటిలో విలీనం కావడంతో పంచాయతీల సంఖ్య మరోసారి తగ్గింది.

నాయకుల్లో నిరాశ...

గ్రామ పంచాయతీల విలీనంతో ఆయా గ్రామాల్లోని రాజకీయ యువ నాయకులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. రాజకీయంగా ఎదగాలని కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న ఆశావహులకు చుక్కెదురైంది. ప్రజా సేవ చేస్తూ సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూ తమ రాజకీయ ఎదుగుదులకు పునాదులు వేసుకున్న నాయకులు.. ఏమి చేయాలో తోచకుండా ఉన్నారు. గ్రామ పంచాయతీల్లో స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తే వార్డు సభ్యులు, ఉపసర్పంచు, సర్పంచు పదవులతో పాటు ఎంపీటీసీ సభ్యులుగా ఎన్నికయ్యే అవకాశాలుంటాయి. మున్సిపాలిటి ప్రాంతంలో ప్రస్తుతం ఈ తరహా పదవులు ఇకపై ఉండకపోవడంతో ఆయా గ్రామాల్లోని చోటా, మోటా నాయకులకు రాజకీయ యోగం లేకుండా పోయింది. మరో వైపు మండలంలో ఎంపీటీసీ స్థానాలు కూడా తగ్గిపోనున్నాయి. చిన్న గోల్కొండ, పెద్ద గోల్కొండ ఎంపీటీసీ స్థానాల గ్రామాలు విలీనం అయ్యాయి.

వైభవంగా గ్యార్వీ సంబురం



గ్యార్వీ ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజలు, నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని దర్గాలో బుధవారం గ్యార్వీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

18న టీహబ్‌లో జీసీసీ ఇన్నోవేషన్ సమ్మిట్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో ఈనెల 18వ తేదీన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్స్(జీసీసీ) ఇన్నోవేషన్ సమ్మిట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం 3.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, సైయింట్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, టీహబ్ సీఈఓ సుజిత్ జాగిర్దార్ తదితరులు ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. కార్యక్రమంలో 50కిపైగా స్టార్టప్‌ల ప్రతినిధులు,400పైగా వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారు.

రమణీయం..చెంచులక్ష్మీ నర్సింహ కల్యాణం


ఆకట్టుకున్న నృత్య రూపకం

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య శిక్షణాలయం కళాకృతి నృత్యాలయ సంస్థ 11వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్య గురువు భారతి ఆధ్వర్యంలో చెంచులక్ష్మీ నర్సింహ కల్యాణ సాంస్కృతిక పౌరాణిక వారసత్వ శాస్త్రీయ నృత్య రూపకం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ..భారతదేశ పౌరాణిక సాంస్కృతిక శాశ్వత వారసత్వానికి ఈ నృత్య రూపకం నిదర్శనంగా నిలుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కూచిపూడి కేరళ నృత్యగురువు అనుపమా మోహన్, డీజీ.రాజబాబు, డీఆర్‌డీఓ సౌత్ హెడ్ నీల యాదయ్య, విశ్రాంత శాస్త్రవేత్త కె.రాంబాబు, డ్యాన్స్ ఇండియా సంపాదకులు విక్రమ్‌కుమార్, సంస్థ వ్యవస్థాపకులు భారతి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

గోల్కొండ: నిరుపేదలకు తాము అండగా ఉంటూ వారిని ఆదుకుంటున్నామని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ పీస్ అంబాసెడర్ మొహమ్మద్ నజీబ్ అన్నారు. బుధవారం ఆయన టోలిచౌకి అక్బర్‌బాగ్‌లోని తన కార్యాలయంలో నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కమిటీ ప్రతినిధులు నిరుపేదలను గుర్తించి వారికి నిత్యావసరాలు అందేలా చూస్తున్నారన్నారు. ఆయన వెంట మొహమ్మద్ ఇస్మయిల్, ఫరాహ్ తదితరులు ఉన్నారు.

చెత్తతో ఎరువుల తయారీ

- తడి, పొడి చెత్తను వేరు చేయాలి
- మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, వైస్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి


ఎరువుల తయారీని పరిశీలిస్తున్న కమిషనర్, వైస్ ఛైర్మన్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంటి నుంచి వస్తున్న చెత్తను తడి, పొడిగా వేరు చేసి కంపోస్టు ఎరువులను తయారు చేసి మొక్కల పెంపకానికి వినియోగిస్తామని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్, వైస్ ఛైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం వారు వట్టినాగులపల్లిలోని చెత్త డంపింగ్ యార్డులో వర్మి కంపోస్టు ఎరువుల తయారీని పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో వస్తున్న పొడి చెత్తను ఇప్పటికే బ్రిక్‌లుగా తయారు చేసి ఓ సంస్థకు విక్రయించటంతో ఆదాయం వస్తున్నదన్నారు. అదే తరహాలో రాబోయే రోజుల్లో తడి చెత్తతో ఎరువులను తయారు చేసి మున్సిపాలిటీ తరపున మొక్కల పెంపకానికి వినియోగిస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసిన తరువాతనే ఆటో వాళ్లకు ఇచ్చి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇంచార్జి సంపత్, బీజేపీ నాయకుడు బి.రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

మణికొండ: వారంతా కలిసి రెండు దశాబ్దాలకు పూర్వం కలిసి ఒకే పాఠశాలలో చదువుకున్నారు. వారంతా బుధవారం కోకాపేటలోని కమ్యూనిటీ హాల్‌లో కలిసి సందడి చేశారు. నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001-02వ విద్యాసంవత్సరం పదవ తరగతి చదువుకుని ఉత్తీర్ణులయ్యారు. వారంతా జీవితాలలో స్థిరపడి ఎవరికి నచ్చిన రంగంలో వారు రాణిస్తున్నారు. తిరిగి తమంతా కలిసి తమ ఉపాధ్యాయులను సన్మానించాలని నిర్ణయించుకున్నారు. బుధవారం రోజంతా తమ పాఠశాల జీవితాన్ని నెమరువేసుకోవటంతో పాటు ప్రస్తుత కుటుంబాల వివరాలు, పిల్లల చదువులు, వివాహాల గురించి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు అప్పటి విద్యార్థులు పాల్గొన్నారు.


కోకాపేటలో కలిసిన నార్సింగి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

రూ.749.15 కోట్ల ఆస్తి పన్ను వసూలు లక్ష్యం

వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి


సమీక్ష నిర్వహిస్తున్న వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి: ఆస్తి పన్ను రూ.749.15 కోట్లు లక్ష్యంగా వంద శాతం వసూలు చేయాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో ఆస్తి పన్ను వసూలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.749.15 కోట్లు టార్గెట్ అని ఇప్పటి వరకు రూ.299.35 కోట్లు వసూలు చేశారని తెలిపారు. వేడుకలు, పండుగల సందర్భంగా సెలవు దినాలు రావడంతో ఆస్తి పన్ను వసూళ్ల పురోగతి మందగించిందన్నారు. శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్లలో మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని డాకెట్లలో ఆస్తి పన్ను వసూలు ఆశాజనకంగా లేదని, సంబంధిత ఏఎంసీలు పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. శేరిలింగంపల్లి, చందానగర్, యూసుఫ్‌గూడ, పటాన్‌చెరు ఆర్సీపురం సర్కిళ్లలోని 34 డాకెట్లలో వసూళ్ల తీరును సమీక్షించారు. ఉప కమిషనర్లు, ఏఎంసీలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

'సమ్మేళనాలు ప్రేమాభిమానాలను పెంచుతాయి'


మాట్లాడుతున్న బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్

చార్మినార్: సమ్మేళనాలు ఒకరినొకరు కలిసి మెలిసి ఉండడంతో పాటు అందరిలో ప్రేమాభిమానాలను పెంచుతాయని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ అన్నారు. పాత నగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు అధ్యక్షతన దసరా సమ్మేళనం జరిగింది. హనుమాన్‌నగర్‌లోని ఎస్కేవి బంకెట్ హాల్‌లో జరిగిన ఈ దసరా సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై.. వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న వారికి ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇలాంటి సమ్మేళనాలు ప్రతి ఏటా జరగాలన్నారు. రోజు వారి జీవన ప్రయాణంలో తీరిక లేకుండా పని చేస్తున్న వారందరికీ ఇలాంటి కార్యక్రమాలు ఉపశమనం కలిగిస్తాయన్నారు. మున్నూరు కాపుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అదుముళ్ల శైలజ హామీ ఇచ్చారు. మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్టీ దదువై రాఘవేందర్ మాట్లాడుతూ.. మున్నూరు కాపుల అభివృద్ధికి ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్‌ను కోరారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి


విద్యుత్ ఏఈకి వినతి పత్రం అందజేస్తున్న వెంకటేష్

మైలార్‌దేవ్‌పల్లి: బాబుల్‌రెడ్డినగర్‌లో నెలకొన్న విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మాజీ కౌన్సిలర్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.వెంకటేష్ కోరారు. ఈ మేరకు గగన్‌పహాడ్‌లోని విద్యుత్ ఏఈ సుధాకర్‌కి బుధవారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రెండు దశాబ్దాల క్రితం వేసిన స్తంభాల వైర్లు ఇంటిపై నుంచి వెళ్లాయి వాటిని తొలగించాలని కోరారు. పలు ప్రాంతాల్లోని రోడ్లపై కంచెలేని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. వైర్లు తెగి పడేలా ఉన్నాయని వాటికి మరమ్మతులు చేయించాలని సూచించారు. కాలనీలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఏఈ సుధాకర్ మాట్లాడుతూ.. ఆయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. స్థానిక నేతలు రాయుడు, సింహాద్రి, రాజ్‌కుమార్, రిషి, ప్రవీణ్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలైకు మహా పాదయాత్ర


పాదయాత్రగా వెళ్తున్న అయ్యప్ప స్వాములు

రాజేంద్రనగర్: బుద్వేల్‌కు చెందిన అయ్యప్ప స్వామి భక్తులు కాలినడకన శబరిమలైకు పయనయ్యారు. మహా పాదయాత్రను మంగళవారం ప్రారంభించారు. బుధవారం స్వాములు షాద్‌నగర్‌కు చేరుకోవడంతో అయ్యప్ప స్వాములు బక్క అనిల్ రెడ్డి, దాసరి జగదీష్ యాదవ్‌తో పాటు ఇతర స్వాములను బుద్వేల్ ప్రాంతానికి చెందిన యువకులు ఘనంగా సన్మానించారు. 41 రోజుల పాటు ఈ పాదయాత్ర కొనసాగుతున్నట్లు స్వాములు వెల్లడించారు.

ఘనంగా నాభిశిల ప్రతిష్ఠాపనోత్సవం


కొత్తగూడలో నాభిశిల ప్రతిష్ఠ

గచ్చిబౌలి: భక్తుల ప్రత్యేక పూజల మధ్య నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్ఠాపనోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. మూడు రోజులుగా కొత్తగూడలో నాభిశిల ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దేవతామూర్తులకు ఉష్ణోదక స్నానం, అభిషేకం, తైలలేపనం మంత్ర, యంత్రస్థాపన, మూర్తిస్థాపన, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలు సమర్పించారు. అన్నదానం నిర్వహించారు. అనంతరం గడప కడుగుట, పంబళ్లు, పోతురాజుల బండ్లు, ఒగ్గు పని వాళ్ల సమక్షంలో గ్రామ ఎదుర్కోలు కార్యక్రమాలు నిర్వహించారు.

మనూలో ముగిసిన వర్క్‌షాప్


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొ.ఇష్తియాక్ అహ్మద్

రాయదుర్గం: ఉర్దూ పాఠ్య పుస్తకాల తయారీ బృహత్తర బాధ్యత అని మనూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ అన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), భారతీయ భాషా సమితి(బీబీఎస్) 'మనూ' సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఉర్దూ రచయితల వర్క్‌షాప్ ముగింపు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పంజాబ్ సెంట్రల్ యూనివర్సిటీ బీబీఎస్ నోడల్ అధికారి ప్రొఫెసర్ గుర్పాల్‌సింగ్, డెక్కన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సల్మా అహ్మద్ ఫారూఖీ, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ ఎం వనజ ప్రసంగించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారికి సర్టిఫికెట్లను అందించారు.

ఆలయాలు, మసీదుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


మాట్లాడుతున్న ఏసీపీ విజయ్ శ్రీనివాస్

విజయనగర్‌కాలనీ: ఆలయాలు, మసీదుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆసిఫ్‌నగర్ పోలీస్ డివిజన్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మందిర్, మసీద్ కమిటీ ప్రతినిధులతో ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..ఇటీవల పలు ఆలయాల వద్ద జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా మందిర్, మసీదుల కమిటీ సభ్యులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమైన ఆలయాలు, మసీదుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నిరంతర నిఘా ఉండేలా చూడాలన్నారు. బస్తీలు, కాలనీలలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా మైత్రీ పీస్ కమిటీ సభ్యులు తమవంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు, మైత్రి కమిటీ అధ్యక్షుడు యాసీన్ అలీ, ప్రధాన కార్యదర్శి అశ్వాక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.